వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 01 ఏప్రిల్ 2025

## సమస్యల రహిత సమాజం కోసం నిరంతర కృషి

**చిన్నమండెం, మార్చి 31 ప్రభాతవార్త :**

సమస్యల రహిత సమాజం కోసం నిరంతర కృషి చేయడం జరుగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసం నందు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించడం జరుగుతుందన్నారు.



## గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యం

**చిన్నమండెం, మార్చి 31 ప్రభాతవార్త :**



రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిన్నమండెం మండలం, చిన్నమండెం టౌన్ నందు 15 లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంటు రోడ్డును మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ గతంలో రాయచోటి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోక ఎంతో వెనుకబడి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, ఏర్పాటు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడం జరుగుతుందని ఇందులో భాగంగా నేడు సంబేపల్లి టౌన్ లో 15 లక్షల రూపాయలతో మంజూరైన సిమెంట్ రోడ్డు ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడం జరిగిందన్నారు. రాబోయే రోజులలో ప్రతి గ్రామంలో అన్ని మోలిక వసతులు ఏర్పాటు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడం జరుగుతుందని ఇందుకు ప్రతి ఒక్కరూ తమకు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పక్కా ప్రణాళికతో ఒంటిమిట్ట శ్రీ రామ బ్రహ్మోత్సవాలు

### సమన్వయంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం చేస్తాం

### సీఎం, గవర్నర్ రాక నేపథ్యంలో బందోబస్తు సమీక్షించిన కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జెఈవో వీరబ్రహ్మం, ఎస్పీ అశోక్ కుమార్



ఒంటిమిట్ట రామాలయం వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్, ,జేఈవో, ఎస్పీ



కళ్యాణ వేదిక వద్ద చర్చిస్తున్న అధికారులు

**రాజంపేట అర్బన్, మార్చి 31 ప్రభాతవార్త**

ఈనెల 5నుంచి ప్రారంభం కానున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయ బ్రహ్మోత్సవాలను పక్కా ప్రణాళికతో నిర్వహిస్తున్నట్లు కడప కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, టిటిడి జేఈవో వి.వీరబ్రహ్మం వెల్లడించారు. జిల్లా అధికార యంత్రాంగం ,టీటీడీ సమన్వయంతో కలిసి పనిచేసి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేస్తుందని వారు పేర్కొన్నారు. సోమవారం బ్రహ్మోత్సవాలకు సంబంధించి వారు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర గవర్నర్ రానున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లపై కూడా చర్చించారు. ఈ సందర్భంగా జేఈవో వి. వీరబ్రహ్మం అధికారులకు పలు సూచనలు చేశారు. కల్యాణ వేదిక ప్రాంగణానికి చేరిన జేఈవో ఏప్రిల్ 11న జరుగనున్న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవానికి జరుగుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కల్యాణ వేదిక పక్కన ఉన్న పీఏసీ బిల్డింగ్ పనులను పరిశీలించారు. ఏప్రిల్ 11వ తేదీన గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కడప ఎయిర్ పోర్ట్ నుండి ఒంటిమిట్ట కల్యాణ వేదిక ప్రాంగణానికి చేరుకోనున్న నేపథ్యంలో సీఎం రానున్న మార్గాలలో ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లతో చర్చించారు. బాకారాపేటలో పార్కింగ్ రోడ్ డైవర్షన్ మార్గాలను, భక్తులు ప్రవేశించే, నిష్క్రమణ మార్గాల్లో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ముందస్తుగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్యాలరీలలో భక్తులకు త్రాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు, సీతారాముల కళ్యాణం ముత్యపు తలంబ్రాలు ప్యాకెట్లు పంపిణీ చేసేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ల ఏర్పాటు, అత్యవసర పరిస్థితుల్లో గ్యాలరీల నుండి బయటకు వచ్చేలా అత్యవసర మార్గాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద పెండింగ్ పనులు, మరమ్మతులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, దాదాపు 2 వేల మంది పోలీసు సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎలాంటి తొక్కిసలాటలకు అవకాశం లేకుండా క్షేత్ర స్థాయిలో పటిష్టంగా ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు. కల్యాణ వేదిక ప్రాంతంలో జిల్లా కలెక్టర్ ఇచ్చిన పలు సూచనలకు తగ్గట్లుగా అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు, అగ్నిమాపక, పోలీసు, అన్నప్రసాదాలు పంపిణీకి ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని జేఈవో సూచించారు. అనంతరం పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ, పోలీసు, టిటిడి అధికారుల సమావేశంలో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో టిటిడి సీఈ సత్యనారాయణ, ఎస్ ఈలు వేంకటేశ్వర్లు, మనోహర్, కడప ఆర్డీవో జాన్ ఎర్విన్, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ ,ఇతర అధికారులు పాల్గొన్నారు. కోదండ రాముడు సన్నిధిలో కలెక్టర్,ఎస్పీఒంటిమిట్ట కోదండరామయ్య సన్నిధిలో జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జిల్లా ఎస్పీ జివి అశోక్ కుమార్ లు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అంతకు ముందు ఆలయానికి వచ్చిన వారికి టిటిడి వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం రంగ మండపంలో టిటిడి అధికారులు తీర్థప్రసాదాలు అందజేసారు.

## భూ తగాదా ఘర్షణ లో ఒకరు మృతి

**బ్రహ్మంగారిమఠం మార్చి 31 ప్రభాతవార్త**



మండల పరిధిలోని సోమిరెడ్డి పల్లె గ్రామపంచాయతీలోని మద్ది రెడ్డి పల్లి గ్రామానికి చెందిన పెసల నారాయణరెడ్డి, పెసలజయరాం రెడ్డి దాయాదుల కుటుంబాల మధ్య సుమారు 15 సంవత్సరముల నుండి భూ విషయమై వివాదాలు నడుస్తూ ఉన్నయని ఈ క్రమంలో సాయంత్రము 5 గంటల సమయంలో మద్దిరెడ్డిపల్లి గ్రామానికి పడమర వైపున గల వ్యవసాయ పొలంలో ఇరువర్గాలు గొడవపడి కట్టెలు, రాళ్లు మరియు వేటకొడవలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారని ఈ దాడిలో గాయపడగా పెసల నారాయణరెడ్డి 63 ని మెరుగైన వైద్యం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.పెసల శివారెడ్డి పెసల ఆదిలక్ష్మి శివారెడ్డి అనువారు ఒక వర్గంలో గాయపడగా మరొక వర్గంలో పెసల జయరామిరెడ్డి,పెసల సాంబశివారెడ్డి ,పెసల మల్లికార్జున రెడ్డి,పెసల వెంకటలక్ష్మి, సాంబశివారెడ్డి అనువారికి తీవ్ర రక్త గాయాలయి క్రిందపడిపోయినారు. ఈ దాడిలో ఇరువర్గాల కి చెందిన 05 మోటార్ సైకిల్ లను కాల్చివేయడం జరిగినది. మృతి చెందిన ఆయనను పోస్ట్ మార్టం నిమత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు.మరొక వర్గంలో గాయపడిన జయరామి రెడ్డి వారిని మరొక అంబులెన్స్ లో మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్ కి తరలించామని పూర్తి సమాచారం తెలియవలసి వున్నద ని సబ్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

## ఉమ్మడి కడప జిల్లాలో పలువురు సిఐలు బదిలీ

**రాజంపేట అర్బన్, మార్చి 31 ప్రభాతవార్త**

ఉమ్మడి కడప జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి పిటిసి లో పనిచేస్తున్న యూ .సదాశివయ్యను ప్రొద్దుటూరు టుటౌన్ కు బదిలీ చేశారు. అలాగే పొద్దుటూరు టూ టౌన్ లో పనిచేస్తున్న ఎం. యుగంధర్ ను ఆళ్లగడ్డకు బదిలీ చేశారు. రాయచోటి వి ఆర్ లో ఉన్న కే ఎల్లంరాజును కడప మహిళా పోలీస్ స్టేషన్కు బదిలీ చేశారు. కడప మహిళా స్టేషన్లో పనిచేస్తున్న ఎం కృష్ణారెడ్డిని చెన్నూరు అర్బన్ పోలీస్ స్టేషన్కు బదిలీ చేశారు. చెన్నూరు అర్బన్ స్టేషన్ లో పనిచేస్తున్న పురుషోత్తం రాజును కడప ఎస్ బి 1 కు బదిలీ చేశారు. కడప ఎస్ బి లో పనిచేస్తున్న టి రెడ్డప్పను కడప సిసిఎస్ 2 కు బదిలీ చేశారు. సిసిఎస్ 2 లో పనిచేస్తున్న చాంద్ భాషను పులివెందుల స్టేషన్కు బదిలీ చేశారు. పులివెందులలో పనిచేస్తున్న టీ. నర్సింహులును వేంపల్లికు బదిలీ చేశారు. వేంపల్లిలో పనిచేస్తున్న ఏ. సురేష్ రెడ్డిని కడప విఆర్ కు బదిలీ చేశారు. కడప విఆర్‌ఓ పనిచేస్తున్న ఈశ్వర్ రెడ్డిని కడప డిసిఆర్బికి బదిలీ చేశారు. కడప డిసిఆర్బి లో పనిచేస్తున్న యు వెంకట్ కుమార్ ను కడప వి ఆర్ కు బదిలీ చేశారు. కడప విఆర్లో పనిచేస్తున్న కృష్ణంరాజు నాయక్ ను కడప సిసిఎస్1 కు బదిలీ చేశారు. సిసిఎస్ 1 లో పనిచేస్తున్న సి. భాస్కర్ రెడ్డిని కడప విఆర్ కు బదిలీ చేశారు. కర్నూలు విఆర్లో పనిచేస్తున్న శ్రీహరిని మైదుకూరు అర్బన్ స్టేషన్ కు బదిలీ చేశారు. ఈ మేరకు కర్నూల్ రేంజ్ లో 16 మంది సీఐ లను బదిలీ చేశారు.

# ప్రభుత్వం మైనార్టీలకు ఎల్లవేళలా అండగా ఉంటుంది

### రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి





**రాయచోటి, మార్చి 31 ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రినారా చంద్రబాబునాయుడు గారు మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ వారి అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా రాయచోటి పట్టణంలోని బండ్లపల్లె ఈద్గానందు ముస్లిం సోదరులు నిర్వహించిన సామూహిక ప్రార్థనలలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గతంలో మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ముస్లింల సంక్షేమానికి విశేష కృషి చేయడం జరిగిందని అదేవిధంగా నాలుగోసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా మైనార్టీలకు అండగా ఉంటూ ప్రభుత్వ పరంగా అందాల్సిన పథకాలన్నీ వారికి కేటాయించడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని ఇలాంటి ప్రభుత్వం పదికాలాలపాటు ఉండేందుకు దేవుని ఆశీస్సులు ఉండాలని అల్లాను ప్రార్థించడం జరిగిందన్నారు. ప్రతి మనిషి తనకు ఉన్నంతలో తోటి మనిషికి సాయం అందించే స్వభావాన్ని అలవర్చుకొని ఇతరులకు సహాయ పడాలన్నారు. ప్రపంచమంతటా శాంతియుతంగా ఉండేలా ఆ అల్లాహ్ కృప యావత్ ప్రాణికీ అందాలని దేశం, రాష్ట్రం, జిల్లా సుభిక్షంగా ఉండాలని మంత్రివర్యులు ఆకాంక్షించారు. రాయచోటి పట్టణంలోని హిందూ, ముస్లింలు సోదర భావంతో కలిసిమెలిసి జీవించి మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.రంజాన్ ప్రార్థనలు అనంతరం మంత్రివర్యులు రాష్ట్ర ప్రజలకు రంజాన్ పండుగ శుభాకాక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో రాయచోటి పట్టణంలోని ముస్లిం మత పెద్దలు, ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**రాజంపేట అర్బన్, మార్చి 31 ప్రభాతవార్త**

ఒంటిమిట్ట పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పి ఇజి అశోక్ కుమార్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉమెన్ హెల్ప్ డెస్క్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. స్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పెండింగ్ కేసులు త్వరగా విచారించి పరిష్కరించాలన్నారు. రికార్డులు అప్ డేట్ చేసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.శ్రీ కోదండ రామాలయ బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా పగలు, రాత్రి ముమ్మరంగా గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. స్టేషన్‌లో సిసిటిఎన్ఎస్ పనితీరును పరిశీలించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించి క్షుణ్ణంగా విచారణ జరిపి నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వృత్తి పరమైన సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిశీలించి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. పాత నేరస్థులు, సస్పెక్ట్‌ల కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలకు వెళ్లి ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఆదేశించారు. గ్రామాల్లో నైట్‌హాల్ట్ చేయాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ తదితర నేరాలు జరగకుండా గట్టిగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఎస్.పి వెంట ఒంటిమిట్ట సిఐ బాబు, ఎస్ఐ శివప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

### కడప జిల్లాలో

## 10 కరువు మండలాలు

### ప్రభుత్వం ప్రకటన

**రాజంపేట అర్బన్, మార్చి 31 ప్రభాతవార్త**

కడప జిల్లాలో 2024,25 సంవత్సరం రబీ సీజన్లో10 మండలాలను కరువు ప్రాంతంగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 51 కరువు ప్రభావిత మండలాలు కాగా కడపలోనే 10 మండలాలు ఉండడం విశేషం. ఇటీవల రాష్ట్ర విపత్తుల నిర్వహణ కార్యాలయంలో నిర్వహించిన కరువు ప్రభావ కమిటీ సమావేశంలో జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖలు సమర్పించిన నివేదికలను కమిటీ నిశితంగా పరిశీలించింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన నివేదికలను దృష్టిలో ఉంచుకుని, వర్షపాతం లోటు, పంటల నష్టం, భూగర్భ జలాల స్థాయి, వ్యవసాయ స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సెక్రటరీ ఆర్పీ సిసోడియా తెలిపారు. డ్రౌట్ మేనేజ్మెంట్ మాన్యువల్ ప్రకారం, రైతులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని ఉత్తర్వులలో పేర్కొన్నారు. ప్రభుత్వం వేసవి తీవ్రతను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తోందని, అవసరమైన నిధులు, సబ్సిడీలు, సహాయక కార్యక్రమాలను అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలోని కరువు మండలాలు పరిశీలిస్తే పడమటి ప్రాంతంలో దువ్వూరు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కాజీపేట, చాపాడు, మైలవరం తొండూరు మండలాలు ఉన్నాయి. తూర్పు ప్రాంతంలో కాశీనాయన బ్రహ్మంగారిమఠం మండలాలు ఉన్నాయి. పడమటి ప్రాంతం మండలాల్లో కేసీ కెనాల్ సాగునీటి వసతి ఉన్నా కరువు మండలాలుగా ప్రకటించారు అంటే ఏ స్థాయిలో గత ఆర్థిక సంవత్సరం రబి సీజన్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయో అర్థమవుతుంది. అలాగే దుర్భిక్ష ప్రాంతాలైన కాశీనాయన,బ్రహ్మంగారిమఠం మండలాల్లో దుర్భిక్ష పరిస్థితులు ఇంకా దారుణంగా ఉన్నట్లు తెలుస్తోంది.

## దివ్య సుగుణాల పరిమళభరిత సారమే.. ఈద్‌ఉల్‌ఫితర్..

**కడప కార్పొరేషన్ మార్చి 31 ప్రభాతవార్త:**

దైవభక్తి, శాంతి సమైక్యతకు, సోదర స్నేహ భావాలు, దానధర్మాలు వంటి దివ్య సుగుణాల పరిమళభరిత సారమే..ఈద్‌ఉల్‌ఫితర్ (రంజాన్ పర్వదినం) వేడుక ప్రత్యేకత అని ఈద్గాలో పెద్దదర్గా పీఠాధిపతులు హజరత్ సయ్యద్ షా అరీఫుల్లా హుసేనీ సాహెబ్ సందేశం ఇచ్చారు. సోమవారం కడప నగరంలోని బిల్టప్ సర్కిల్ లోని అమీనియా ఈద్గాలో పెద్దదర్గా పీఠాధిపతులు హజరత్ సయ్యద్ షా అరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో రంజాన్ పర్వదిన ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. రంజాన్ ప్రార్థనలు ముగిసిన అనంతరం మాట్లాడుతూ తెలిసో తెలియకో ఏడాదిపాటు చేసిన తప్పులను సమూలంగా కడిగేసే అవకాశం పవిత్రమైన రంజాన్ మాసంలో లభిస్తుందన్నారు. ఈ సృష్టి ధనదాన్యాలు, ఇతర సౌ కర్యాలు అన్నీ దైవం ఇచ్చేనవేనని.. భూమిపై మనదంటూ ఏమీ ఉం దదని, కానీ మనిషి అజ్ఞానంతో అన్నీ తానే సాధించినట్లు భ్రమ ప డుతున్నాడని.. వాటిలో ఏ ఒక్కటి తిరిగి తీసుకు వెళ్లలేడని తెలు సుకోవాలన్నారు. సర్వమతాల సారం ఒక్కటేనని, ఉపవాస దీక్షలు ఆరాధన ప్రార్థనలు మనుషుల్లో ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ ఉపవాసాలు, ఇఫ్తార్ల ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. కులమతాలకు అతీతంగా జిల్లాలో, అటు రాష్ట్రంలో దేశంలో, హిందూ, ముస్లింలు, క్రైస్తవులు కలిసి ఇఫ్తార్ విందుల్లో పాల్గొనడం జరిగిందన్నారు. అల్లా ఆజ్ఞ ప్రకారం ప్రతి ఒక్కరూ తన సంపాదనలో రెండున్నర శాతం జకాత్ రూపంలో పేదలకు ఖర్చు చేయడం ఈ రంజాన్ మాసంలో చేసే పవిత్ర పుణ్యకార్యం అన్నారు. అందుకే ప్రతి మనిషి తనకు ఉన్నంతలో తోటి మనిషికి సాయం అందించే స్వభావాన్ని అలవర్చుకోవాని ప్రజలకు సందేశానిచ్చారు. ప్రపంచమంతటా శాంతియుతంగా ఉండేలా ఆ అల్లాహ్ కృప యావత్ ప్రాణికీ అందాలని.. దేశం, రాష్ట్రం, జిల్లా సుభిక్షంగా ఉండాలని కోరారు.





## గుర్తు తెలియని శవానికి పాడే మోసిన ఏఎస్ఐ

**సిద్దవటం మార్చి 31 ప్రభాతవార్త**



శాంతిభద్రతలు కాపాడడమే తమ విధి అనుకోకుండా అనాధ శవానికి పాడే మోశాడు స్థానిక ఏఎస్ఐ సుబ్బరామ చంద్ర మండలంలోని కనుములోపల్లె రైల్వే స్టేషన్ సమీపం వద్ద గుర్తుతెలియని 60 ఏళ్ల వయసు వృద్ధుడు ఆదివారం సాయంత్రం మృతి చెందాడని స్థానికులు తెలిపారు.సోమవారం కడప నగరానికి చెందిన శ్రీ కాశీ విశ్వనాథ సేవా సమితి ఆధ్వర్యంలో అంత్యక్రియలను నిర్వహించారు.ఈ అంత్యక్రియల్లో స్థానిక ఏఎస్ఐ సుబ్బారామచంద్ర పాడే మోసి మానవత్వాన్ని చాటుకున్నారు.అనాధ వృద్ధుడు మృతి చెందడంతో సిద్ధవటం పోలీసులు చుట్టుపక్కల విచారించారు.అతనికి సంబంధించిన వారు ఎవరూ లేకపోవడంతో హిందూ సంప్రదాయం ప్రకారం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రి యలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ స్టేషన్ రైటర్ కొండయ్య,సమితి ట్రస్ట్ సభ్యులు గుండ్లకొండ రవి,నాగుల రాంప్రసాద్,దామోదర్ రెడ్డి,లక్ష్మణ్ సురేష్ మధు తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్

సిద్దవటం మార్చి 31 ప్రభాతవార్త

ముస్లింలు పవిత్రంగా భావించే దివ్య ఖురాన్ గ్రంథం ఈ మాసంలో అవిర్భవించడమే క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ అని ఇమాం పీర్ బాషా ఖాద్రి అన్నారు. మండలంలోని అన్ని మస్జిద్‌లతో పాటుగా టక్కోలు, భాకరాపేట ఈద్గాలో, మండలకేంద్రమైన సిద్దవటం దిగువపేట, ఎగువపేట కు చెందిన వారు ఎస్. రాజంపేట సమీపంలోని ఈద్గాలో సోమవారం పవిత్ర రంజాన్ ప్రార్ధనలు నిర్వహించుకున్నారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ పండుగ, పర్వదినం అంటే శుభవేళ, ఉత్సవ సమయం అని అర్థం. పండుగలు మన జీవన ప్రవంతిలో భాగమై మన జాతీయతకు, సంస్కృతీ వికాసానికి దోహదం చేస్తూ ఉన్నాయి. పండుగ మానావాళికి హితాన్ని బోధిస్తుంది. ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే ఖిరంజాన్‌ఖి పండుగ సైతం ఇదే హితాన్ని మానవాళికి అందిస్తుంది. నమాజ్ దుష్టచింతనల్ని, దురాగతాల్ని, కుహనా సంస్కారాన్ని ఎదుర్కోగలదు. సత్ప్రవర్తనను నేర్పించగలదు. సత్ప్రవర్తనగల వ్యక్తి సర్వేశ్వరుని దృష్టిలో అందరికన్నా మిన్న (ఖురాన్ 49:13) ఈద్‌ను శ్రామికుని వేతనం లభించే రోజు అని ఖురాన్ విస్పష్టం చేసింది. నెల రోజులు కఠోరవ్రతం పాటించినవారి శ్రమకు పరిపూర్ణ ప్రతిఫలం ఈ రోజే లభిస్తుందని విశ్వాసం. పర్వదినాన ఉదయం స్నానపానాదులు ముగించుకుని వస్త్రాలు ధరించి సుగంధం పన్నీరు పూసుకుని తక్బీర్ పఠిస్తూ మస్జిద్ కు చేరుకున్నారు. మస్జిద్ లో ప్రార్థన చేశారు. ఇహ్‌దినస్సిరాత్ ముస్తఖీమ్ (మాకు సన్మార్గాన్ని చూపు). సమస్త మానవాళి హృదయాల్ని సద్బుద్ధితో నింపాలని అల్లాహ్ ను కోరడం జరుగుతుందన్నారు. రంజాన్ పండుగ మతసామరస్యానికి, పరస్పర సదవగాహనకు, సమైక్యతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. రంజాన్ నెలలో మరొక విశేషం అత్యధిక దానధర్మాలు చేయడం జరుగుతుందన్నారు. సంపాదనాపరులైనవారు, సంపన్నులైనవారు రంజాన్ నెలలో



జకాత్ అచరించాలని ఖురాన్ బోధిస్తోందన్నారు. ఆస్తిలో నుంచి నిర్ణీత మొత్తాన్ని పేదలకు దానం చేయడాన్ని జకాత్ అని అంటారు. దీనిని పేదల ఆర్థిక హక్కుగా పేర్కొంటారన్నారు. దీని ప్రకారం ప్రతి ధనికుడు సంవత్సరాంతంలో మిగిలిన తన సంపద నుండి 30 శాతం చొప్పున ధన, వస్తు, కనకాలను ఏవైనా నిరుపేదలకు దానంగా ఇవ్వాలన్నారు. పేదవారు కూడా అందరితో పాటు పండుగను జరుపుకొనడానికి, సంతోషంలో పాలుపంచుకునేందుకు ఈ జకాత్ ఉపయోగపడుతుందన్నారు. జకాత్‌తో పాటు ఫిత్రాఖి దానానికి రంజాన్ నెలలో ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. మూడు పూటల తిండికి, ఒంటినిండా బట్టకు నోచుకోని పేదవారు ఎంతో మంది ఉన్నారన్నారు. ఇలాంటి అభాగ్యులకు, పేదవారికి పండుగ సందర్భంలో దానం చేయాలని ఇస్లాం మతం ఉద్బోధిస్తోందన్నారు. దీనినే ఫిత్రాదానం అని పిలుస్తారన్నారు. ఉపవాస వ్రతాలు విజయవంతంగా ముగిసినందులకు అల్లాహ్ పట్ల కృతజ్ఞతగా పేదలకు ఈ ఫిత్రాదానం విధిగా అందజేస్తారన్నారు. ఈ దానం కుటుంబంలోని సభ్యులందరి తరపున పేదలకు అందజేయాలన్నారు. ఫిత్రాదానం వల్ల క్షమించబడతాయని మహమ్మద్ అనుచరుడు అబ్దుల్లా బిన్ మసూద్ తెలియజేయడం జరుగుతుందన్నారు.

# జాతీయస్థాయి కత్తి సాము పోటీల్లో పాల్గొన్న వత్తలూరు గోపిత్రిక.

రైల్వేకోడూరు,అర్బన్, మార్చి 31, ప్రభాత వార్త.

రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలంలోని కొర్లకుంట గ్రామానికి చెందిన వత్తలూరు గోపిత్రిక మార్చ్ 27 నుంచి 30వ తేదీ వరకు ఒడిస్సా రాష్ట్రంలో కటక్ నగరం నందు జరుగు జాతి ఇస్తాయి కత్తి సాము పోటీలలో పాల్గొని సోమవారం అతి రసవత్తరంగా కత్తి సాము పోటీని ఆడారు. ఈమె గతంలో ఏడవ తరగతి వరకు మంగంపేట కార్పొరేషన్ పాఠశాలలో చదువుతూ ఎనిమిదవ తరగతి ప్రస్తుతం తిరుపతి నారాయణ ప్రైవేటు కళాశాలలో చదువుతుంది. గత నెల 11న విజయవాడలో నిర్వహించిన రాష్టస్థాయి కత్తి సాము ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. మార్చి 27 నుంచి 30 వరకు జరిగిన 26వ అండర్ 14 జాతీయస్థాయి కత్తి సాము పోటీల్లో పాల్గొని రెండు రాష్ట్రాలతో గెలుపొంది, మూడో రాష్టమైన మధ్యప్రదేశ్ కు చెందిన బాలికతో మారుమూల గ్రామమైన కొర్లకుంటకు చెందిన గోపిత్రిక తన సామర్థ్యాన్ని చాటుకున్నారు.



నెల తిరిగేసరికి ఇంటి అద్దె కట్టడానికి నాన్న పడుతుననన కష్టాన్నీ.. ఇద్దరమ్మాయిలే ఎలా నెట్టుకోస్తామో ఈ జీవితాన్ని అని అమ్మ పడుతున్న ఆవేదనను కళ్లారా చూసింది. కోచింగ్ ఊసే లేకుండా నాలుగేళ్లపాటు రోజుకో గంట సాధన చేసి కోడింగ్‌పై పట్టు పెంచుకుంది. పే-పాల్ కంపెనీలో రూ.34 లక్షలకుపైగా వార్షిక వేతనానికి ఎంపికయింది. కన్నవాళ్ల కలల్నీ, ఇబ్బందుల్నీ తీర్చాలను కుంటోంది.

**ఆమే హుజూరాబాద్‌కి చెందిన యాల్ల కృష్ణవేణి.**

పేధింటి ఆడబ్డిని.. అమ్మానాన్నల కష్టాలు చూస్తూ పెరిగా. ఇంజినీరింగ్ పూర్తయ్యేసరికి ఎలాగైనా మంచి ప్యాకేజీతో ఉద్యోగం అందుకోవాలననది నా లక్ష్యం. దాన్ని సాధించగలిగా, అయితే, ఈ విజయం అంత సులవుగా మాత్రం రాలు. మాది హనుమకొండ జిల్లా పెంచికల్‌పేట. నాకు ఊహ తెలిసేనాటికే అమ్మానాన్నలు ఉపాధి కోసం హుజూరాబాద్‌కు వచ్చేశారు. నాన్న సదిరెడ్డి ప్రైవేటు చిట్‌ఫండ్‌లో ఉద్యోగి. అమ్మ అంజలి గృహిణి. చెల్లె హరిప్రియ మెడిసిన్ చదువుతోంది. మ్మానాన్నలు మాకోసం ఎంతో కష్టపడుతున్నారని చిన్నప్పుడే అర్థమైంది. ఆ ఇబ్బందుల నుంచి గట్టెక్కాలంటే చదువు తప్ప మరో దారి లేదని భావించా. అందుకే, ఏ తరగతైనా నేనే ఫస్ట్ బిటెక్ హనుమకొండ సమీపంలోని ఎస్సార్ కళాశాలలో సిఎస్ఇలో ఏరాను.

**ఆ భయం వెంటాడటంతో....** ఓ పక్క ఇంజినీరింగ్ పూర్తయినా ఉద్యోగాలు దొరక్క ఇబ్బందిపడుతోన్న సీనియర్ల పరిస్థితి ఆందోళన కలిగిస్తే, మరో పక్క ఇంటి అద్దె చెల్లించలేని నాన్న స్థితి కలవరపెట్టింది. దీంతో అందరికంటే భిన్నంగా చదివితేగానీ అనుకున్న లక్ష్యం చేరుకోలేనని అర్థమైంది. అందుకే, చదువుతో పాటు ఇతర నైపుణ్యాలపైనా పట్టు తెచ్చుకోవాలనుకున్నా. ఇందుకోసం రోజూ ఒక గంటపాటు కోడింగ్‌పై పట్టు పెంచుకోవడం ఆరంభించా. మద్యమధ్యలో సినిమాలు, రీల్స్.. వంటి వాటి గురించి స్నేహితులు చెప్పినా.. నాకు మాత్రం నా లక్ష్యమే గుర్తొచ్చేది. అవి చూసేత కాసేపు ఆనందంగా అనిపించొచ్చు కానీ, నేను ఎంచుకున్న పంథాలో విజేతగా నిలిస్తే ఎప్పటికీ సంతోషమే నా వెంట ఉంటుందని నాకు నేను సర్దిచెప్పుకొనేదాన్ని.

**ఎప్పటికప్పడు అప్‌డేటెడ్‌గా...** ఇలా బిటెక్ మొదటి ఏడాది నుంచి ఫైనల్ ఇయర్ వరకు రోజూ కచ్చితంగా ఫోన్ ల్యాప్‌టాప్‌లను కేవలం కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నైపుణానయల్ని నేర్చుకునేందుకే వాడా. తాజాగా వచ్చిన చాట్‌జీపిటీలో ప్రతిభ చూపించి మూడునెలల పెయిడ్ ఇంటర్న్‌షిప్ అవకాశం దక్కించుకున్నా. తరవాత జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో పే-పాల్ కంపెనీలో రూ.34.40 లక్షల ప్యాకేజీతో ఉద్యోగానికి ఎంపికాయ్య. అంటే నెలకు సగటున 2,86 లక్షల జీతాన్ని ఒదుకోబోతున్నా. నాన్న ఇప్పటికీ రూ.15 వేల కోసం పడుతున్న కష్టం చూసి.. నా శ్రమ ఫలించిందనే సంతోషం ఇప్పుడు మనస్ఫూర్తిగా కలుగుతుంది. ఎవరికైనా నేనొకటే చెబుతా.. ఎంత కష్టమైనా ఇష్టమైన దాని కోసం కష్టపడితే కచ్చితంగా విజయం సాధించగలమనడానికి నేనే ఓ ఉదాహరణ.

# వైవిధ్యమైన ఫ్యాషన్ నగలు













దుస్తులూ, యాక్సెసరీల్లోనే కాదు.. పసిడి నగల్లోనూ వైవిధ్యమైన ఫ్యాషన్లను కోరుకుంటోంది ఈ తరం. అందుకే, ఇప్పుడు ఆభరణాలన్నీ ఆధునిక సొగసుద్దుకుని మరీ వారిని ఆకట్టుకుంటున్నాయి. అలాంటి వాటిల్లో ఎసెమిట్రికల్ స్టైల్ ఒకటి. నిన్నమొన్నటివరకూ సాధారణంగా డ్రెస్‌ల్లో కనిపించినఈ డిజైన్ ఇప్పుడు జ్యూయెలరీకి నిండుదనం తెస్తోంది. పాశ్చాత్యశైలినితలపిస్తూ సంప్రదాయ సౌందర్యాన్ని మరింత అందంగా ఇనుమడింపజేస్తోంది. ఎసిమెట్రికల్ ప్యాటర్న్ అంటే. నగ అంతా ఒకే తీరున ఉండకపోవడమే ! రెండు డిజైన్లను ఒకే ఆభరణంలో కలగలిపో, లేదంటే ఒక వైపున కాస్త పెద్దగా, మరోవైపున చిన్నగా ఉండేలా తీర్చిదిద్దడమో, ఇవేవీ కావంటే పెండెంట్ మధ్యకి కాకుండా కాస్త పక్కగా ఏర్పాటు చేయడమో! ఏది ఏమైనా ఈ తరహా నగలు.. ధరించినవారికి కొత్తదనాన్ని తెచ్చిపెట్టడమే కాదు చూసేవాళ్లందరినీ అయస్కాంతంలా ఆకట్టుకుంటున్నాయి. వాటిని మీరూ ఓ సారి





# పుస్తక పఠనం మంచిదే ..

కొంతమంది పిల్లలు గట్టిగా బయటకు చదివితే నెమ్మదిగా చదవలేవా అంటూ తిడుతుంటాం. కానీ ఇలా పుస్తక పఠనం చేయడం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు. నిపుణులు. అవేంటంటే..

- పిల్లలు పుస్తకంలో పదాలను గుర్తిస్తూ బయటకు చదివేటప్పుడు వాటిని గుర్తుంచుకోవడానికి ప్రయత్నిస్తారు. అంతేకాదు విషయాన్ని సులభంగా గ్రహించగలుగుతారు. ఇది వారిలో జ్ఞాపకశక్తి పెంచుతుంది.
- .విని నేర్చుకునే వారిని ఆడియో లెర్నర్స్ అంటారు. ఇలాంటివారు దేన్నైనా శ్రద్ధంగా వినడానికి ప్రయత్నిస్తారు. వారిలో భాషానైపుణ్యం మెరుగుపడి చిన్నతనం నుంచే ఉచ్చారణ అలవాటు అవుతుంది. పదాలు సులభంగా నేర్చుకుంటారు.
- చాలామంది పిల్లలకు చదవమంటే చిరాకు వస్తుంది. అదే గట్టి చదువు అంటే మాత్రం ఎంతో హుషారుగా ఉంటారు. దీని వల్ల వారిలో ఉన్న ఒత్తిడి, ఆందోళనలు దూరం అవుతాయని అంటూన్నారు.



## చెలి చిట్కా

వామును నీళ్ళలో నానబెట్టి ఆ నీటిలో కొద్దిగా ఉప్పు కలిపి తాగితే వాంతులు తగ్గుతాయి.

# ఇంజినీరే జీవితం కాదు !



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

ప్రశ్న : మేము పేద వారము. పిల్లల్ని ప్రైవేటు స్కూళ్ళు, కాలేజీలలో చదివించే స్తోమత లేదు. మాకు ఒక అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. అమ్మాయి పదవతరగతి పాస్ అయ్యింది. ప్రభుత్వ పాఠశాలలో చదవడం వల్ల మంచి మార్కులు తెచ్చుకోలేకపోయింది. దీనితో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్స్ గ్రూపులో సీటురాలేదు. ఎలాగైనా డాక్టరు లేక ఇంజినీరు కావాలని కోరుకుంటున్నది. అయితే ఆఖరికి హెచ్.ఇ.పి గ్రూపులో సీటు వచ్చింది. అతి కష్టం మీద హాస్టల్లో కూడా సీట్లు వచ్చింది. అయితే అమ్మాయి చాలా బాధపడుతున్నది ప్రైవేటు జూనియర్ కళాశాలలో కనీసం ఎంపిసి గ్రూపులో చేరి ఇంజనీరైనా కావాలంటోంది. మాకు ఆశక్తి లేదంటే ఏడుస్తోంది. తన కర్మఖాలి మాలాంటి పేదవారికి పుట్టాను అంటోంది. ఆమె లెక్కలు, సైన్స్‌లో కొంత వెనుకబడింది. సాంఘిక శాస్త్రంలోమంచిమార్కులు వచ్చాయి. ఆమె కోరినట్టు ప్రైవేటు కాలేజీలో చేర్పించలేము. ఆర్ట్స్ గ్రూపు చదివి గుమాస్తా ఉద్యోగం చేయడం కంటే మా వృత్తి చేయడమే మేలాటోంది. తన స్నేహితులు కొందరు మంచి కాలేజీల్లో చేరారు. వారితో పోల్చుకుని బాధపడుతున్నది. కనీసం తన తమ్ముడిని అయినా మంచి పాఠశాల, కాలేజీలో చదివించమంటోంది. ఆమె మాటలు వింటే ఆస్తి మూరడు ఆశ బారెడు అన్న సామెత గుర్తుకు వస్తోంది. నేను నా భర్త పదవ తరగతి వరకు చదువుకున్నాము. అయినా ఆర్ట్స్ గ్రూపులు చదివి చాలా గొప్పవారైన వారిని గూర్చి తెలుసు. ఆ మాట చెప్పితే ఆమె వినడం లేదు. చేతకాక సామెతలు చెప్పడం ఎందుకు అంటూ ఈసరించ కుంటోంది. ఈ దశలో ఆమెలో ప్రేరణ కలిగించే మార్గం చెప్పండి.

- ఒక సోదరి, చిత్తూరు జిల్లా



జవాబు : అమ్మా మీ సమస్య అర్థం అయింది. చాలా మంది విద్యార్థులు, యువకులు ఆలోచనా విధానాలలో లోపం ఉంది. ఆశమూరెడు అర్హత చిత్తేడు అన్నట్లు మాట్లాడుతుంటారు. పోటీ ప్రపంచంలో రాణించేందుకు నిరంతరం కృషి చేయక తప్పదు. ప్రభుత్వ పాఠశాలలో చదివితే మార్కులు రావు అన్నది నిజం కాదు. నిజానికి ప్రైవేటు పాఠశాలలకంటే ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకే ఎక్కువ విద్యార్హతలు ఉంటాయి. అతి కొద్ది మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా ఉండవచ్చు నేమో కానీ అందరూ బాగానే చెపుతుంటారు. అయితే విద్యార్థుల్లో శ్రద్ధ, కృషి, తెలివితేటలు నైపుణ్యాల లోపంవల్ల చదువులో వెనకబడుతుంటారు. కొందరు కొన్ని సబ్జెక్టుల్లో రాణించి, కొన్నింటిలో వెనకబడుతుంటారు. అలాంటి వారిని తల్లిదండ్రులు ఉపాధ్యాయులు గుర్తించి సరిదిద్దాలి,. అలాగే విద్యార్థులు కూడా స్వయంప్రేరణతో లోపాలను అధిగమించే ప్రయత్నం చేయాలి. అయితే సహజ సిద్ధంగా ఉన్న తెలివి తేటలు, నైపుణ్యాలకు అనుగుణంగా కోర్సులు ఎంచుకోవడం మంచి పద్ధతి మన సమాజంలో డాక్టరు, ఇంజినీరు వృతుల పట్ల ఎక్కువ మోజు ఉంది. మిగిలిన వృత్తులను గూర్చి ఆలోచించడం మానేశారు. ఉదాహరణకు సుప్రీంకోర్టులో కొందరు సీనియర్ లాయర్లు ఒక గంట వాదించేందుకు 20 లక్షలకుపైగా తీసుకుంటారు మల్టీనేషనల్ కంపెనీలలో కీలక బాధ్యతలు నిర్వహించే వారు డాక్టర్లు, ఇంజనీరు కంటే ఎక్కువ సంపాదిస్తున్నారు. ఐఎఎస్ , ఐపిఎస్ చదివిన వారు సమాజం ఉన్నత స్థాయి వ్యక్తులుగా ఉన్నారు. వీరంతా ఆర్ట్ గ్రూపు చదివిన వారే అన్నది గుర్తుపెట్టుకోవాలి. అతికొద్ది మంది సైన్స్ చదివి ఇతర వృత్తులు చేపట్టేవారు ఉన్నారు. కాబట్టి ఇంజినీరు మాత్రమే గొప్ప కాదన్న అవగాహన కల్పించండి

వ్యధ

# పిచ్చి బఠాణీలు.. మెచ్చు గుణాలు



**తాజా బఠాణీలు..** ఆకుపచ్చ ముత్యాల్లా ఎంత అందంగా ఉంటాయి కదూ! చూస్తుంటేనే నోట్లో వేసుకోబుద్దేస్తుంది. బఠాణీలను క్యాలీఫ్లవర్, క్యాబేజ్, బంగాళదుంప, క్యారెట్.. ఇలా దేనితో కలిపి వండినా వాటి రుచి రెట్టింపవుతుంది. బిర్యానీ, కిచిడీల్లో ఇవి గనుక లేకపోతే.. పెద్ద లోటుగానే ఉంటుంది. వీటితో స్వీట్లు, హాట్లు కూడా చేయొచ్చు. సూప్, సలాడ్ రూపంలోనూ సేవించవచ్చు. బఠాణీల్లో ఎన్ని సుగుణాలున్నాయంటే.. ఇవి.. పచ్చిబఠాణీలు ఎర్రరక్త కణాలు వృద్ధిచెందడంలో, శరీరం అంతటికీ ప్రాణవాయువును అందజేయడంలో తోడ్పడతాయి. రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధం చేస్తాయి. బఠాణీలు తినడం వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. తరచుగా బఠాణీలు తినేవారికి క్యాన్సర్ వచ్చే అవకాశం తక్కువ. వీటిలో ఉన్న సెపోనిన్స్ ద్రవ్యాలు క్యాన్సర్ చేరిన సూక్ష్మ క్రిములను నశింపచేస్తాయి. వీటిల్లో ఉండే కెరొటినాయిడ్స్, జిక్సాండౌథిన్లు కళ్లకు దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా కాపాడతాయి. యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. మధుమేహం, ఉబకాయం, గుండెజబ్బుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఇవి కొన్ని రకాల క్యాన్సర్లను సైతం నిరోధిస్తాయని పరిశోధనల్లో తేలింది. పీచు, పొటాషియం, ప్రొటీన్లు ఉన్నాయి. మాంసాహారం తినని వాళ్లకి మంచి పోషకాహారం. ఇంత మేలు చేసే బఠాణీలను విస్మరిస్తే ఎలా! తరచూ ఏదో రూపంలో తీసుకుందాం. ఆరోగ్యంగా ఉందాం కానీ అవసరమైన దాని కంటే ఎక్కువగా తింటే మాత్రం అనర్థమేనండోయ్.

# చోఖామేళా

ఆధ్యాత్మికం

**సాయిబాబా షిరిడీకి వచ్చినప్పుడు** ఖండేరావు గుడిలోనికి పోబోతుంటే, ఆ ఆలయ పూజారి మహల్సాపతి వారించాడు. సాయిబాబా అప్పుడు కోపం తెచ్చుకోకుండా.. నీ అభిమతాన్ని అనుసరించి నేను దూరం నుండే దర్శనం చేసుకుంటాలే! దానికి అభ్యంతరం లేదనుకుటాను. మీ పురాణాలలో ఒక కథ ఉన్నది. పంచముడైన చోఖామేళా పాండురంగనికి ప్రియమైనవాడు. పాండురంగని వద్ద పూజ చేసే పురోహితులకంటే వంద రెట్లు శ్రేష్ఠుడు. శ్రీహరి ద్వారాన్ని చేరుటకు శ్రద్ధతో ప్రయత్నంచేసేవారు తప్ప మిగిలిన అందరూ పంచములే! ఎవరి ఆంతర్యం పరిశుద్ధంగా ఉంటుందో, వాడు సర్వత్ర పరిశుద్దుడే! అన్నాడు. మహారాష్ట్రలో చోఖామేళాను గూర్చి తెలియని వారుండరు. అతనిని పాండురంగని ఆలయంలోపలకు రానీయలేదు. కానీ అంతటా పాండురంగని చూచి మైమరచిపోయే భక్తుడు. ఒకనాడు ఒక గోడను కడుతూండగా, అది కూలటం వలన చోఖామేళా, మరి కొందరు మరణించారు. శవాలను తీయటానికి చాలా సమయం పట్టింది. సామూహిక దహనం చేశారు. నామదేవునితో పాండురంగడు ‘నా భక్తుడు చోఖామేళా అతని సమాధి నా మందిరమునకు ఎదురుగా ఉండాలనే ఒకే ఒక్క కోరికతో జీవించాడు. ఆ కోర్కె తీర్చుట నా లక్ష్యం’ అన్నాడు. చోఖామేళా ఎముకలను గుర్తించటం సాధ్యం కాదుకదా? అన్నాడు నామదేవు. పాండురంగడు చోఖామేళుని ఎముకలు సహితం నా నామాన్ని ఉచ్చరిస్తాయి అన్నాడు. నాదేవుడు ఆ ఎముకల గుట్ట దగ్గరకు వెళ్లి, ఒకొక్క ఎముకను చెవి దగ్గర పెట్టుకొని, ఏవి



అయితే పాండురంగని నాకు స్మరణ చేసినవో, వాటిని ఏరి తీసుకువచ్చి, పాండురంగని ఆలయమునకు ఎదురుగా చోఖామేళా సమాధిని నిర్మించాడు. చోఖామేళుని ఎముకలు రంగని నామాన్ని ఉచ్చరిస్తాయి. చోఖామేళుడు వైశాఖ బహుళ పంచమినాడు (మే నెల) దేహాన్ని త్యజించాడు. సాయిదేహాన్ని త్యజించాడు. మహా సమాధిని నిర్మించాడు. బొంబాయి నివాసి యగు శ్రీమతి రుస్తుంజీ బాబా మహా సమాధిపై శిరమునుంచి బాబా నీవు జీవించి ఉన్నప్పుడు నా కష్టాలను కడతేర్చి నన్ను రక్షించినావు, ఇప్పుడు నాకు దిక్కెవ్వరు? అని రోదించగా ఆమెకు సమాధి నుండి రుస్తుంబేటా కబ్ ఆయా? అన్న మాటలు మూడుసార్లు వినిపించినవి. సాయి బాబా అంటారు నా ఎముకలు సహితము భక్తులతో మాట్లాడును.

- యం.పి.సాయినాథ్

# గ్రామాల్లో చిరుధాన్య విప్లవం

**చేయి చేయి కలిపితే చేతకానిది ఏముంటుంది? వీళ్లదీ అదేమాట. ఐదువేలమంది మహిళలు కాయగూరలు పండించి నగరాలకు ఎగుమతి చేశారు. ఫర్నిచర్ తయారుచేసి పట్టణాలకు పంపించారు. తాజాగా చిరుధాన్యాలని సామాన్యులకు చేరవచేస్తూ ఆరోగ్యానికి పట్టం కడుతున్నారు.**

జనగామ జిల్లాలోని కాకతీయ మహిళా సహకార సంఘం ఏం చేసినా అది తోటివారికి స్ఫూర్తినిస్తూనే ఉంది.

కొవిడ్ తరవాత స్టేషన్‌ఘన్‌పూర్ ప్రాంతంలోని పల్లెల్లో ఒక కార్పొరేట్ సంస్థ సర్వే నిర్వహించింది, ఆశ్యర్యంగా ఒక్క తాటికొండ గ్రామంలోనే 600 బిపి, షుగర్ వ్యాధిగ్రస్థులున్నట్టు ఆ సర్వేలో తేలింది. ఈ విషయం తెలుసుకున్న కాకతీయ మహిళా సహకార సంఘం సభ్యులు.. అనారోగ్యం నుంచి కోలుకోవడానికి చికిత్సతో పాటు చిరుధాన్యాలతో స్వీట్లతో సహా అన్ని రకాల వంటలూ చేసు కోవచ్చని ముందుగా తమ సంఘ సభ్యులకే అవగాహన కల్పించారు. ఆ తరవాత నుంచీ మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వంటిచోట్ల సేంద్రియ పద్ధతుల్లో పండించిన జొన్నలు, రాగులు, సజ్జలను నెలకోసారి లారీల్లో ఘున్‌పూర్ తెప్పించుకుంటున్నారు. సొంతంగా గిర్నీలు, మరమిల్లులు ఏర్పాటు చేసుకుని చిరుధాన్యాలని మర పట్టిస్తున్నారు. గ్రామాల్లో చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసి బయటకన్నా పది రూపాయలు తక్కువకే పిండి, రవ్వ అమ్ముతు న్నారు. ప్రస్తుతం వీరు 75 గ్రామాల్లో ప్రతి నెలా జొన్న, రాగి, సజ్జ పండి, రవ్వలతోపాటు గోధుమలను విక్రయిస్తూ అరోగ్యానికి పట్టం కడుతున్నారు. ఇంతకీ వీళ్ల ప్రయాణం ఎలా ప్రారంభమైందంటే 22 ఏళ్ల నక్రితం గ్రామీణ మహళల శక్తిని ప్రపంచానికి చాటేందు వెంకటస్వామి స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలో 12 మంది సభ్యులతో కాకతీయ మహిళా మాక్స్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశారు. వీరంతా నెలకు రూ.పది నుంచి రూ.50 వరకు పొదుపు చేస్తూ ఆర్థికంగా బలపడ్డారు. క్రమంగా వీళ్ల పొదుపు కోట్ల రూపాయలకు చేరుకుంది. అలా అలా ఒకరి నుంచి ఒకరు స్ఫూర్తి పొందుతూ 75 ఊళ్లలో 5200 మంది సభ్యులు ఈ సంఘంలో చేరారు. పొదుపు సొమ్ముతో మొదట వీళ్లు ఒక సూపర్ మార్కెట్ ప్రారంభించారు. ఆ తరవాత వ్యాపారంలో చురుకుగా ఉండేందుకు కంప్యూటర్ శిక్షణ తీసుకున్నారు., 2018లో సేంద్రియ కూరగాయలు పండించి హైదరాబాద్‌కు మొత్తంలో ఎగుమతి చేసేవారు. సంఘంలోని ఒంటరి మహిళలువడ్రంగం పనిలో శిక్షణ తీసుకున్నారు.గుమ్మాలు, కిటికీలు, డైనింగ్ టేబుళ్ల కంప్యూటర్ టేబుల్ చేసి ఉపాధి పొందుతున్నారు. అలా అంచెలంచెలుగాఎదుగుతున్న ఈ సంఘం ప్రస్తుతం చిరుధాన్యాల ఉత్పత్తులతోనూ దూసుకెళ్లోంది.



## ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి



**చిన్నమండెం మార్చి 31 ప్రభాతవార్త:**
మండలంలోని సి పొలిమేరపల్లెలో నడివీధి గంగమ్మతల్లి దేవర సందర్భంగా సోమవారం మాజీ ఏంయల్ఏ శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యకర్తలు, అభిమానులు ఇచ్చిన విందులలో పాల్గొన్నారు. నడివీధి గంగమ్మ తల్లి దయతో వర్షాలు సంవృద్ధిగా కురిసి, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం చిన్నమండెం మండలం పొలిమేరపల్లెలో నడివీధి గంగమ్మ దేవర ఉత్సవం సందర్భంగా వైఎస్ఆర్ సిపి కార్యకర్తలు, అభిమానులు ఇచ్చిన విందులలో శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక పూజలు గావించారు. పొలిమేరపల్లెలో వైఎస్ఆర్‌సిపి లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్ప రెడ్డి, నాయకులు, కార్యకర్తలు వట్టం కృష్ణారెడ్డి, ఆనంద్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, చంద్రపాల్ తదితర కార్యకర్తల నివాసాలకు వెళ్లిన శ్రీకాంత్‌రెడ్డికి ఇంటింటా ఆత్మీయ స్వాగతాలు పలికారు. మాజీ సింగల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, సర్పంచ్ లోకేశ్వర్ రెడ్డి, నాగశేషా రెడ్డి, మండల జెసిఎస్ కన్వీనర్ చుక్కా అంజనప్ప, భాస్కర్ నాయుడు, మధుసూదన్‌రెడ్డి, ఆర్మీ వెంకట రమణా రెడ్డి, అమర కాంత్, ఇంద్రారెడ్డి, రెడ్డి శేఖర్, ప్రదీక్ రెడ్డి, పెద్ద రెడ్డెప్ప రెడ్డి, వెంకట రమణ నాయుడు, ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రంజన్ వేడుకలు

**చిన్నమండెం మార్చి 31 ప్రబాతవార్త :**



మండలంలోని ముస్లిం సోదరులు రంజాన్ ముగింపు వేడుకలు ముస్లిం మైనార్టీలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నమాస్ కట్ట వద్దకు ముస్లిమ్ సోదరులు ఉదయమే భారీగా చేరుకున్నారు. ప్రార్థనలు చేసారు .అనంతరం ముస్లిం సోదరులను ఆత్మీయంగా ఆలింగనం చేసుకొని ఒకరికొక్కారు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నెలరోజుల ఉపవాస దీక్షను విరమించి బంధు మిత్రులతో తీపి మాంసహారలతో పండుగను ఘనంగా జరుపుకొన్నారు.

## ఘనంగా ఈదుల్ ఫితర్ ఉత్సవాలు

**పెద్దమండెం మార్చి 31 ప్రభాతవార్త**
ముస్లిం సోదరులకు అతి ముఖ్యమైన పండుగ రంజాన్ పండుగ ఈ పండుగను ముస్లిం సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ పండుగను నిర్వహిస్తారు నెల రోజులపాటు ఉపవాసాలు ఉంటూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ నీతి నియమాలతో భక్తి శ్రద్ధలతో ఆచరిస్తారు ఈ పండుగలు చేసిన పాపాలు విముక్తికి ఈ నెలలో ప్రార్థనలు ఉపవాసాలు చేయడం వల్ల పాపాలు తొలగిపోతాయని మహమ్మద్ ప్రవక్త కురాన్ లో పొందుపరిచారు దీంతో ఈ రంజాన్ వాసనానికి ప్రాముఖ్యత సంచరించుకుంది అనంతరం సోమవారం ఈదుగాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు అనంతరం ఒకరికి ఒకరు ఆ లింగనాలు గావించుకున్నారు అనంతరం దానధర్మాలు చేశారు దీంతో ఈ రంజాన్ మాసం పూర్తయింది.

## ఈద్గాలో ముస్లింలు ప్రార్థన



**మైదుకూరు, మార్చి 31, ప్రభాతవార్త:**
మున్సిపాలిటీ నంద్యాల రోడ్డు ఈద్గా ఆవరణలో సోమవారం పవిత్ర రంజాన్ పర్వదిన సందర్భంగా ప్రార్థనలలో మత పెద్దల ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో కలిసి ప్రార్థనలు జరిపారు.ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలను ముగించుకొన్న ముస్లిం సోదర, సోదరీమణులు పవిత్ర రంజాన్ పర్వదిన సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కార్యక్రమంలో పలువురు రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దేరు నీటి విడుదలతో రైతుల కళ్ళలో ఆనందం

**తంబళ్లపల్లె మార్చి 31 ప్రభాతవార్త :**



పెద్దేరు నీటిని విడుదల చేస్తున్న చైర్మన్

జిల్లాలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన పెద్దేరు ప్రాజెక్టు ఆయకట్టుకు నీటి విడుదలతో రైతుల కళ్ళలో ఆనందం వెల్లి విరిసిందని ఆయకట్టు చైర్మన్ కొటాల శివకుమార్ తెలిపారు. సోమవారం ఆయన తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు పెద్దేరు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల సాగు, చెరువులు, మూగజీవాల తాగునీటి కోసం ప్రత్యేక పూజలు నిర్వహించి కుడి కాలువ గేటు ఎత్తి నీటిని విడుదల చేశారు. గతవారం ఎడమ కాలువకు నీటిని తంబళ్లపల్లె ఇంచార్జ్ జయచంద్రారెడ్డి విడుదల చేసిన విషయం విధితమే. ఈ సందర్భంగా కొటాల శివకుమార్ మాట్లాడుతూ పెద్దేరు ప్రాజెక్టుతో తంబళ్లపల్లె, పెద్దమండెం మండలాల రైతులకు సాగునీరు, మూగజీవాలకు తాగునీరు, తద్వారా భూగర్భ జలాలు పెరిగి తాగునీటికి సైతం జీవకర్రగా నిలిచినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు సమస్యలపై తంబళ్లపల్లి ఇంచార్జ్ జయచంద్రారెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా మంత్రి రాంప్రసాద్ రెడ్డిల చొరవతో పరిష్కరించి ప్రాజెక్టును ప్రముఖ పర్యాటక కేంద్రం తో పాటు వేలాది ఎకరాల సాగుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్ నారాయణస్వామి, శివన్న, మల్లయ్య, సీతారాం, శంకరప్ప, వెంకటరమణ, కిట్ట, రాము, రమణ, అల్లావుద్దీన్, సుధాకర్, రమేష్, లస్కర్ శ్రీనివాసులు, జేసీబి భాస్కర్ రైతులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు

**రామసముద్రం ఏప్రిల్ 31 ప్రభాతవార్త**
మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండుగ వేడుకలుమండలం కేంద్రంలోని తిరుమలరెడ్డిపల్లె చెంబకూరు, నడింపల్లె గొల్లపల్లె, ఊలపాడు, కేసీపల్లె, గ్రామల్లోని ముస్లిం సోదరులు ఘనంగా రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. రంజాన్‌ను పురస్కరించుకుని ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.దిగువపేట మసీద్ నుండిచెక్ పోస్ట్ మీదుగా ఈద్గా వరకు వెళ్లి ప్రార్థనలు చేశారు. అనంతరం మతపెద్దలు ముత్తవల్లి సిరాజ్ భాష మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని ఎంత పవిత్రంగా చేస్తామని గత నెల నుంచి ఉపవాసాలతో ఎంతో కఠోర దీక్షలతో హిందూ ముస్లింలు అన్నదమ్ముల మెలగాలని ఈ సంవత్సరం వర్షాలు బాగా పడి రైతులు సుఖశాంతులతో ఉండాలని ఆ అల్లాను వేడుకున్నట్లు తెలిపారు.



## అత్యంత భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

**లక్కిరెడ్డిపల్లి : మార్చి 31 ప్రభాత వార్త**
ముస్లిం సోదరులకు అత్యంత పవిత్రమైన పండుగలలో రంజాన్ ఒకటి. ముస్లిం సోదరులు 30 రోజుల పాటు ఉపవాస దీక్షలు ముగిసిన తర్వాత భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు జరుపుకుంటారు. సోమవారం మండల కేంద్రం లోని రెడ్డివారిపల్లె, కోణంపేట, పందిళ్ళపల్లి, దప్పేపల్లి ఈద్గా వద్ద ముస్లిం మైనార్టీ సోదరులు ప్రార్థనలు అనంతరం ఈద్ ముబారక్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి ఎండలు తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉదయం 8 గంటలకే నూతన వస్త్రాలు ధరించి దర్గా చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసి 5 పూటలా ప్రార్థనలు చేశారు. మత గురువు మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా ముస్లిం సోదరులు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేచే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**పుల్లంపేట; మార్చి 31 (ప్రభాతవార్త)**



మండలంలోని పలు గ్రామాల్లో పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రైల్వేకోడూరు శాసనసభ్యుడు అరవ శ్రీధర్ చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేయడం జరిగింది. శాసనసభ్యుడు ఆరవ శ్రీధర్, వరలక్ష్మి ఇద్దరూ కలిసి బాధితుల ఇళ్లకు వెళ్లి ఈ చెక్కులను పంపిణీ చేశారు. పుల్లంపేట మండలంలోని కిష్టం పల్లి పంచాయతీలో కృష్ణంపల్లి గ్రామానికి చెందిన గంగయ్య కు 1,582885 రూపాయలు, కొత్తపేట రాచపల్లి గ్రామానికి చెందిన గాలిచర్ల సుబ్బరాజుకు 20524 రూపాయలు, గ్రామానికి చెందిన ఉమామహేశ్వర్ రెడ్డికి 45 వేల రూపాయలు, పి వి జిపల్లికి చెందిన తరిగోపుల పద్మావతికి 1,18,251 రూపాయలు చెక్కులను వారు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పుల్లంపేట మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు కాకర్ల చంద్రశేఖర్ నాయుడు, కవుటూరి శ్రీరాములు, వేణుగోపాల్‌రెడ్డి, కిరణ్ సింగమాల రాహుల్ రెడ్డి, సాయి గిరీష్ రెడ్డి, ప్రేమకుమార్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామ దేవతకు చల్లగుడు

**ముద్దనూరు, మార్చి 31, ప్రభాతవార్త:**



పట్టణంలోని యాదవ్ వీధి నందు చల్లగుడు కార్యక్రమాన్ని ఉగాది పండుగ మరుసటి దినము గత కొన్ని సంవత్సరాలుగా వస్తున్న ఆచారం సందర్భంగా కర్ణమయ్య ఇంటిదగ్గర సోమవారం నాడు గ్రామదేవతలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి సకాలంలో వర్షాలు పడి పాడి పంటలతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని చల్లగుడు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కర్ణమయ్య కుమారుడు రామయ్య స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు, మహిళలు గ్రామ పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

## రోడ్డు ప్రదమాదంలో ఇరువురికి గాయాలు

**ముద్దనూరు, మార్చి 31, ప్రభాతవార్త:**
మండలంలోని ఉమ్మారెడ్డిపల్లె క్రాస్ దగ్గర బైక్‌పై వెళుతున్న భార్యాభర్తలకు పంది అడ్డు రావడంతో ప్రమాదంలో బైక్ బోల్తా పడింది స్థానికులు తెలిపారు. వివరాల్లోకి వెళితే మండలంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ భార్య ఓబులమ్మ ఆదివారం రాత్రి కొర్రపాడు గ్రామము నుంచి వెల్దుర్తి వెళ్తుండగా పంది ఢీకొనడంతో బైకు అదుపుతప్పి బోల్తా పడి ఓబులమ్మ తీవ్ర గాయాల అయ్యి స్పృహ కోల్పోయింది భర్త లక్ష్మీనారాయణకు స్వల్ప గాయాలు కాగా స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా వెంటనే ఘటనా స్థలానికి సిబ్బంది చేరుకొని పదమ చికిత్స అందించి పొద్దుటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సను అందించినట్లు సిబ్బంది పైలెట్ సుబ్రమణ్యం, మహేష్ తెలిపారు.

## చిత్తూరు డివైఈవో చంద్రశేఖర్ మృతి

**మదనపల్లి క్రైమ్, మార్చి 31 ప్రభాతవార్త.**
చిత్తూరు డివైఈవోగా పని చేస్తున్న జి. చంద్రశేఖర్ (60) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. గత వారం రోజులుగా అనారోగ్య సమస్యలతో హైదరాబాదులో చికిత్స పొందుతున్న చంద్రశేఖర్ చికిచల పొందుతూ మృతి చెందాడు. గతంలో మదనపల్లి మండల విద్యాశాఖ అధికారిగా, అలాగే పెంచుపాడు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా, మదనపల్లి ఉప విద్యాశాఖ అధికారిగా పనిచేసి న చంద్రశేఖర్ ప్రస్తుతం చిత్తూరు ఉప విద్యాశాఖ అధికారిగా పని చేస్తున్నారు. విధి నిర్వహణలో ఉన్నతాధికారుల నుంచి మన్నలను పొందటంతో పాటు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కూడా ప్రశంసలందుకున్నారు.

## హోటళ్లు, షాపుల సమయ వేళల్లో మార్పులు

**మదనపల్లి క్రైమ్, మార్చి 31 ప్రభాతవార్త.**
పట్టణంలో హోటల్లు, షాపుల సమయాల్లో మార్పు చేసినట్లు మదనపల్లి డిఎస్పి కొండయ్య నాయుడు తెలిపారు. సోమవారం డిఎస్పి విలేకరులతో మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా షాపులు, హోటల్లు రాత్రివేళ 10.30 గంటల వరకు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. పర్వదినం పూర్తి కావడంతో రాత్రి 10 గంటలలోపే హోటళ్లు, షాపులను మూసివేయాలన్నారు. రంజాన్ మాసం సందర్భంగా, ముస్లిం సోదరుల సౌకర్యార్థం సమయ వేళల్లో కొద్దిగా సడలింపులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. పట్టణంలో శాంతిభద్రతలను కాపాడటానికి, రాత్రి వేళల్లో అనవసరమైన గుంపులను నివారించడానికి ఈ నిబంధనలు విధించడం జరిగిందన్నారు.

## స్మశానానికి దారి కల్పించాలి

**రైల్వేకోడూరు అర్బన్, మార్చ 31, ప్రభాతవార్త.**
రైల్వేకోడూరు ఉపనపల్లి పంచాయతీ, కొత్తపల్లి గ్రామ దళితవాడకు, స్మశానానికి దారి లేక, గత 15 సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారని దారి సౌకర్యం కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్ విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. ఆ గ్రామాన్ని సందర్శించి దళితులు, బీసీలు ఒకే స్థలములో స్మశానానికి దారి లేక చనిపోయినప్పుడు ఇబ్బందులు పడుతున్నారని ఉన్నదారుల్ని, అదే గ్రామం అగ్రవర్ణాలు ఆక్రమించుకొని పంటలు సాగు చేసుకుంటున్నారని, తెలిపారు. వర్షాలు వస్తే, శవాలు నీటిలో బోధనాల్సిన పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనేకసార్లు, ప్రజా ప్రతినిధులకు, ఎమ్మార్వోలకు, అధికారులకు చెప్పిన పట్టించుకోలేదని, ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని దారి కల్పించాలని విజ్ఞప్తి చేశారు లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్, సుభాన్ పాల్గొన్నారు.



## ప్రతి గ్రామంలో మౌలిక వసతులు

**చిన్నమండెం, మార్చి 31 ప్రభాతవార్త :**
నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అన్ని మౌలిక వసతులు కల్పించి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడం జరుగుతుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిన్నమండెం మండలం, బెస్తపల్లి గ్రామంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నూతన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ గతంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోక ఎంతో వెనుకబడి ఉన్నాయని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది నెలల కాలంలోనే గ్రామాలలో సిమెంట్ రోడ్లు, వీధిలైట్లు, డ్రైనేజీ కాలవలు ఏర్పాటు చేసి ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రాధాన్యత క్రమంలో గ్రామాలలో బోర్లు వేసి ప్రజలకు నీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా చిన్నమండెం మండలం, బెస్తపల్లి గ్రామంలో నేడు నూతన బోరును ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులను బెస్తపల్లి గ్రామ ప్రజలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయికులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆత్మీయుల కోసం అనాథ మృతదేహం ఎదురుచూపులు

**మదనపల్లి క్రైమ్, మార్చి 31 ప్రభాతవార్త.**



పట్టణంలోని బెంగళూరు బస్టాండులో గత నెల 22వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు పక్కన పడి ఉండగా స్థానికులు గుర్తించి 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మరుసటి రోజు వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. 108 సిబ్బంది ఆయన్ను తిరుపతికి తీసుకెళ్లి ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న సమయంలో, ఆ వ్యక్తి తన పేరు జయరాం (55) అని చెప్పినట్లు ఆసుపత్రి వైద్య సిబ్బంది తెలిపారు. అయితే, సోమవారం ఉదయం ఆయన చికిత్స పొందుతూ మృతి చెందారు. జయరాం మృతదేహం ప్రస్తుతం తిరుపతిలోని రుయా ఆసుపత్రి మార్చురీలో ఉంది. అతని కుటుంబ సభ్యులు లేదా బంధువులు ఎవరైనా ఉంటే వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లాలని పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి అసలు పేరు జయరామా, లేక మరేదైనా పేరు ఉందా అనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## భక్తిశ్రద్ధలతో రంజాన్

**ముద్దనూరు, మార్చి 31, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ముస్లిం సోదరులు ఆయా ప్రాంతాలలో ఉన్న ఈద్గా మైదానాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. 30 రోజులపాటు ఉపవాసాలను దీక్షలు పాటించి సోమవారం నాడు ముద్దనూరు పట్టణంలోని జమ్మలమడుగు రోడ్డులోని మసీదు ప్రాంతాలలో తాడిపత్రి రోడ్డులోనున్న ప్రార్థన ఈద్గా మైదానాలలో మత గురువుల ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మత గురువులు బోధిస్తున్న సిద్ధాంతాలను ముస్లిం సోదరులు ఆలకించారు. ముస్లిం సోదరులకు హిందువులు రంజాన్ శుభాకాంక్షలు తెలియపరిచారు. ఈద్గా మైదానాల సమీపంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



## స్వల్పంగా పెరిగిన టమోటా ధరలు

### మదనపల్లె మార్కెట్‌లో కిలో రూ.23

**మదనపల్లె, మార్చి 31 ప్రభాతవార్త :**



మార్కెట్‌కు వచ్చిన టమోటాలు

టమోటా ధరలు గత నాలుగు రోజులుగా రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఇన్నాళ్ళు ధరలు లేక నష్టపోయిన రైతాంగానికి ధరలు పెరుగుతుండడంతో రైతులు కాస్త ఊరట చెందుతున్నారు. సోమవారం టమోటా మార్కెట్‌యార్డులో కిలో గరిష్టధర రూ.23లు పలికింది. పదికిలోల టమోటా బాక్స్ రూ.220నుంచి 230ల వరకు ధరలు పలికాయి. 90మెట్రిక్ టన్నుల టమోటాలు మాత్రమే మార్కెట్‌కు వచ్చాయి. వేసవితో ఇక ధరలు పెరుగుతాయని బయట ప్రాంతాల్లో డిమాండ్ ఏర్పడుతుందని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో టమోట రైతుకు ధరలు గిట్టుబాటు అయ్యే విధంగా వస్తాయని పలువురు చెబుతున్నారు. మదనపల్లె రెవిన్యూ డివిజన్‌లో రైతులు విస్తారంగా సాగు చేశారు. మదనపల్లె, తంబళ్ళపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో టమోటాను రైతులు జీవనాధార పంటగా సాగు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది టమోటాను వేల ఎకరాల్లో సాగు చేశారు. గత ఏడాది మే నెలలో టమోటా కిలో రూ.100లు పలికిన విషయం తెలిసిందే. ఇవే ధరలు మళ్ళీ వస్తాయని రైతులు ఆశించి టమోటాను విస్తారంగా సాగు చేయడం జరిగింది. మదనపల్లె టమోటా మార్కెట్‌యార్డు వ్యాపార లావాదేవీలకు రాష్ట్రంలోనే పేరుపొందింది. ఇక్కడ నుంచి టమోటాలు తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, ఒడిస్సా, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ప్రధాన నగరాలకు ఎగుమతి అవుతాయి. వేలాదిమంది కూలీలు మార్కెట్‌యార్డులో జరిగే వ్యాపార లావాదేవీలతో జీవనం పొందుతారు.

## వక్ఫ్‌బోర్డు బిల్లును వ్యతిరేకిస్తూ నిరసనలు



నల్లబ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్న దృశ్యం

**మదనపల్లె, మార్చి 31 ప్రభాతవార్త :**
రంజాన్ పండగ సందర్భంగా ముస్లిం సోదరులు ఈద్గావద్ద సోమవారం కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసనలు వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డు వక్ఫ్ చట్టసవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చి వక్ఫ్ చట్టసవరణ బిల్లును రద్దు చేయాలన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నిమ్మనపల్లెలో ఘనంగా రంజాన్

**నిమ్మనపల్లె, మార్చి 31 ప్రభాతవార్త :**
మండలంలో ఘనంగా రంజాన్ పండగను సోమవారం ముస్లిం సోదరులు జరుపుకొన్నారు. హిందూ, ముస్లింలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలిపారు. నమాజకట్ట, మసీదుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించుకొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## ప్రార్థనలతో ముగిసిన రంజాన్ పండుగ



గర్నిమిట్ట ఈద్గా వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లిం సోదరులు

**పీలేరు,కె.వి.పల్లె, మార్చి 31 ప్రభాతవార్త:**
మండలంలోని ముస్లిం సోదరులు మార్చి నెలలో నెలవంక దర్శనంతో ప్రారంభించిన రంజాన్ పండుగను సోమవారం గ్రామ సమీపం లో ఏర్పాటు చేసిన ఈద్గాల వద్దకు వెళ్ళి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మండలంలోని లక్ష్మిరెడ్డి గారిపల్లె, గరిమిట్ట, పగళ్ళు, గోరంట్లపల్లె, గుండ్రే వారి పల్లె, మూరేళ్ళ, ఆమ్ముపురం, జాండ్రపేట, తురకపల్లె, నూ ఆనకాలవ, దేవాండ్లపల్లె గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు ఈద్గాల వద్ద కు వెళ్ళి ప్రత్యేక ప్రార్థనలు జరిపి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## రంజాన్ వేడుకలు, పాల్గొన్న నాయకులు



**రైల్వే కోడూరు మార్చి 31 ప్రభాత వార్త...**
మండలంలోని మైసూరు వారి పల్లె ఆవరణంలో సోమవారం మైనార్టీ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా రంజాన్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ ,రాష్ట్ర ఖాది గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి, ముక్కా సాయి వికాస్ రెడ్డి లు పాల్గొని ముస్లింల ప్రార్థనలో పాల్గొనిన వారందరికీ శుభాకాంక్షలు అందజేశారు. ముఖ్యంగా కులమతాల అతీతంగా రంజాన్ పండుగలో పాల్గొని ముస్లింలందరూ సుఖసంతోషాలతో పండగ వేడుకలలో పాల్గొని సంతోషంగా జీవించాలని వారు ఆకాంక్షించారు.

## సేవా రత్న అవార్డు గ్రహీతకు సన్మానం

**వాల్మీకిపురం, మార్చి 31 ప్రభాతవార్త :**



అవార్డు అందుకున్న హేమల సుదర్శనంకు సన్మానం

దళితుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటాలు చేసిన ధీరుడు యమల సుదర్శనమని, ఆయనకు రాష్ట్ర మాలల ఉద్యోగ సంఘం, రిపబ్లిక్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక అంబేద్కర్ సేవా రత్న అవార్డును ఇవ్వడం తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని మాల మహానాడు నాయకులు అన్నారు. సోమవారం వాల్మీకిపురానికి వచ్చిన య్యమల సుదర్శనం దంపతులను వారు శాలువ కప్పి గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల కోసం వారి హక్కులకోసం, వారి అభ్యున్నతికోసం నిరంతరం పరితపించిన నాయకుడు సుదర్శనం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు నాగార్జున, వెంకటస్వామి, సుధాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఈద్గాల వద్ద నిరసన

**వాల్మీకిపురం, మార్చి 31 ప్రభాతవార్త:**



యుగాల వద్ద ముస్లిం సోదరులు నిరసన

ప్రభుత్వం తీసుకొచ్చిన వక్స్ బోర్డు బిల్లును వ్యతిరేఖిస్తూ సోమవారం ఈద్గాల వద్ద రంజాన్ ప్రార్థనలకు ముస్లింలు నల్లరిబ్బన్లను కట్టుకుని హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలు మాట్లాడుతూ వక్ఫుర్డు బిల్లుకు వ్యతిరేఖంగా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశాల మేరకు ఈద్ ఉల్ ఫీతర్ నమాజ్కు తామంతా నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసనసనలతో హాజరయ్యామని వారు తెలిపారు. ఇప్పటికైన ప్రభుత్వం ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలని వారు ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు ఉద్యోగులు, యువత, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో ఈద్‌ఉల్‌ఫితర్



ఈద్గాల వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లిం సోదరులు

**కలకడ మార్చి 31 ప్రభాతవార్త**
ఈద్‌ఉల్‌ఫితర్ పండుగను ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధ నిర్వహించుకున్నారు. మండల కేంద్రమైన కలకడ, దేవలంపేట, పాపి రెడ్డి గారి పల్లి, కోన, బంగారు వాండ్లపల్లి, నడిమిచర్ల, నవాబుపేట, ఎర్రకోటపల్లి తదితర గ్రామాలలో ముస్లిం సోదరులు గత 30 రోజులుగా కఠిన ఉపవాసాలు ఉండి తమకు పవిత్రమైన ఈద్గాల వద్దకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులు చిన్న పెద్ద తేడా లేకుండా ఈద్ ముబారక్ అంటూ ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పేదలకు దానధర్మాలు చేశారు.

## కురబలకోటలో రంజాన్ వేడుకలు

### కూటగొళ్ళ బావాజాన్ ప్రార్థనలు

**కురబలకోట, మార్చి 31 ప్రభాతవార్త :**
ముస్లింలకు పవిత్రమైన రంజాన్ పండగ సందర్భంగా కురబలకోట మండలం అంగళ్ళులో కూటగొళ్ళ బావాజాన్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రార్థనలు జరిపారు. బిజెపి పార్టీలో రెండు దశాబ్దాలుగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో వివిధ క్యాడర్లలో క్రియా శీలకంగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. బిజెపి కార్యకర్తలు, అభిమానులు తన నివాసం వద్ద ప్రత్యేకంగా కేక్‌కట్‌చేసి, స్వీట్లు పంచుకొన్న అనంతరం రంజాన్ ప్రార్థనలు చేపట్టి ఒకరినొకరు అలింగనం చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ సుహైల్, సాయి, నిఖిల్, అల్తాఫ్, సుధాకర్, అనంద, అర్షద్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న దృశ్యం

# ఒకవైపు. ప్రార్థనలు.. మరోవైపు నిరసనలు..


రైల్వే కోడూరు లో రంజాన్ ప్రార్థనల్లో ముస్లింలు


వక్ఫ్ చట్టానికి సవరణ వద్దంటూ నిరసన తెలుపుతున్న ముస్లింలు

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)
రంజాన్ పండుగ సందర్భంగా సోమవారము అన్నమయ్య జిల్లాలోని అన్ని మసీదుల్లో మూకుమ్మడిగా ముస్లింలు ప్రార్థనలు నిర్వహించి రంజాన్ దీక్షను విరమించారు. మరోవైపు ముస్లింలు వక్ఫ్ చట్టానికి సవరణల వద్దంటూ నిరసనలు తెలిపారు. రాజంపేట పట్టణములో జామియా మసీద్, ఆల్ బ్రదర్ మసీద్, స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా సెక్యులర్ భావాలని గౌరవించే ఆంధ్రప్రదేశ్, బీహార్, ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్లు వక్ఫ్ బోర్డు అడ్డుకోవాలని నినదించారు. ముస్లిం సోదరులు వక్ఫ్ బచావో.. దేశ్ బచావో అంటూ సైన్ బోర్డులను చేత పట్టుకొని రాజంపేట ప్రధాన రహదారిలో నిరసన తెలిపారు. భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ముస్లింల మతపరమైన హక్కులను కాలరాస్తున్న వక్ఫ్ అమెండ్మెంట్ బిల్ 24ను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలతో ముస్లింలు ఈద్గాల్లో రంజాన్ ప్రార్థనలకు హాజరయ్యారు. ఇక రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గాల్లో ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ముస్లింలు ఆలింగనం చేసుకున్నారు. జిల్లాలోని ముస్లింలు ఈద్ ఉల్ పితర్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. చిన్న పెద్ద మహిళలు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ ప్రేమ, దయ, సహనము, సంతోషాల కలయికే రంజాన్ మాసమని తెలిపారు. మానవాళి హితాన్ని అకాక్షించే పవిత్ర రంజాన్ పర్వదినాన్ని అత్యంత భక్తి ప్రవుర్తులతో జిల్లా వ్యాప్తంగా ముస్లింలు జరుపుకున్నారు.

# పేదరికం లేని సమాజ నిర్మాణమే రంజాన్ ఆశయం

- ఫిత్రా, జకాత్‌లు పేదలకు తోడ్పడాలి - రంజాన్ ఈద్ ప్రార్థనల్లో మత గురువుల పిలుపు


ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, ముస్లిం సోదరులు

మదనపల్లె, మార్చి 31 ప్రభాతవార్త :
పేదరికం లేని సమాజ నిర్మాణమే రంజాన్ పండుగ ఆశయమని స్థానిక జామియా మసీదు ఇమాం మౌలానా జలాలుద్దీన్‌సాహెబ్ పేర్కొన్నారు. మదనపల్లెలో సోమవారం ఉదయం ఈద్-ఉల్-ఫితర్ పండుగను ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఇందులో భాగంగా స్థానిక నక్కల దిన్నెలోని ఈద్గా మైదానంలో ప్రత్యేక సామూహిక ప్రార్థనలు జరిపారు. ఈసందర్భంగా మౌలానా ముక్తిసుయోబ్ ధార్మికోపన్యాసం చేశారు. రంజాన్ మాసంలో చేపట్టే జకాత్ ఫిత్రా, సదాఖాలు పేదలకు తోడ్పాడాలన్నారు. రంజాన్ స్ఫూర్తిని జీవితాంతం కొనసాగించాలని తద్వారా ఆదర్శ సమాజ నిర్మాణంలో తమ తమ మతాలు ఆచారాలను పాటిస్తూనే ఎదుటివారి విశ్వాసాలను గౌరవించాలన్నారు. పండగ విశిష్టతను తెలియజేశారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదరులు ఉదయం మసీదుల వద్దకు చేరుకొన్నారు. అల్లాహుఅక్బర్, అల్లహుఅక్బర్, లాఇలాహ ఇల్లహు అల్లాహుఅక్బర్ వలిల్లాహిల్‌హమ్ అనే ప్రత్యేక తక్బీర్‌ను పఠిస్తూ ఈద్గా మైదానానికి వెళ్ళి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఒకరినొకరు అలింగనం చేసుకొని ఈద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అనంతరం ఖబ్రస్థాన్‌కు వెళ్ళి పూర్వీకుల ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేశారు.

**ఈద్ ప్రార్థనల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా :**

నక్కలదిన్నె ఈద్గా మైదానం, బసినికొండ పంచాయితీ డ్రైవర్స్ కాలనీలోని ఈద్గాలలో జరిగన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొని అందరికి ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనల్లో వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నిస్సార్‌అహ్మద్, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్, డాక్టర్ ఎస్‌కె.బాషా, ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్‌ఎ.మస్తాన్, పఠాన్‌ఖాదర్‌ఖాన్, మహమ్మద్‌ఖాన్, ఫర్జానారఫి, ఎస్‌ఎ.కరీముల్లా, షంషీర్, నాగూర్‌వల్లి, తదితర ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## పీలేరులో భక్తి శ్రద్ధలతో ఈద్‌ఉల్‌ఫితర్


పీలేరులో జరిగిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లీం సోదరులు

పీలేరు మార్చి 31 ప్రభాతవార్త:
పీలేరులో ముస్లీంలు ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) వండుగ వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించారు. సోమవారం పట్టణంలోని అన్ని మసీదుల నుంచి ముస్లీం సోదరులు స్థానిక జెండామాను దగ్గరకు చేరుకుని, అక్కడి నుంచి సామూహికంగా అల్లాను స్తుతిస్తూ మదనపల్లి మార్గంలోని ఈద్గా మైదానం చేరుకుని, పండుగ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇమామ్ మాట్లాడుతూ ముస్లీంలు పవిత్ర రంజాన్ నెలవంక దర్శనం తరువాతి రోజు నుంచి కఠోర ఉపవాస దీక్షలను ప్రారంభిం, నెల రోజుల పాటు వాటిని ఆచరించి తిరిగి బుధవారం నెలవంక దర్శ నంతో గురువారం రంజాన్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపు కున్నారు. ముస్లీంలు తాము చేసుకునే పండుగల్లో అతి ముఖ్యమైన పండుగ ఈద్ ఉల్‌ఫితర్ ఒకటని, రంజాన్ పండుగ ప్రార్థనల అనంతరం వారి శక్తి కొలదీ పేదలకు నగదు, వస్త్ర దానాలు చేసుకుంటారన్నారు. ఈ సామూహిక ప్రార్థనలు చేయించిన మత గురువు ముఫ్తీ అబ్దుల్లా మాట్లాడుతూ ప్రజలను ఈతి బాధలు, వేసవి ఎండల నుంచి కాపాడాలని, ముస్లీం యువత చెడు అలవాట్లకు, అసాంఘిక కార్యక్రమాలకు లోను కాకుండా చూడాలని, ప్రజలు అనారోగ్యం బారిని పడకుండా కాపాడాలని, జనం పరమత సహనంతో సాటి వ్యక్తుల పట్ల ప్రేమ, ఆప్యాయతలు కలిగి ఉండేలా చూడాలని ప్రార్థించి వేడుకున్నారు. ప్రార్థనల అనంతరం ప్రతి ఒక్కరూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా చీలేరు పట్టణ సిఐ యుగంధర్ పర్యవేక్షణలో ఎన్ఐ, నిబ్బంది ఈద్గా, పట్టణంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా గట్టి బందోబస్తుతోపాటు వాహనాల రాక పోకలను కూడా నియంత్రించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. అలాగే పీలేరు మండలంలోని తలుపుల, జాండ్ల, బాలంవారిపల్లి, రేగళ్ల, వంటిల్లు మొదలగు గ్రామాల్లో ముస్లీంలు రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు జరుపుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## 2న మంత్రి సత్య కుమార్ ప్రొద్దుటూరు రాక

ప్రొద్దుటూరు ఏప్రిల్ 01 ప్రభాతవార్త



ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు రాష్ట్ర వైద్య విద్య ఆరోగ్యశాఖ మాత్యులు సత్య కుమార్ యాదవ్ ఈ నెల 2న ప్రొద్దుటూరులో పర్యటించనున్నట్లు కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పర్యటనలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ను కొత్తపల్లి సర్పంచ్ శివచంద్రారెడ్డి ఆదివారం ఆహ్వానించారు. పంచాయతీ పరిధిలోని రైతు సేవా కేంద్రం, సచివాలయ నూతన భవనం, హెల్త్ క్లినిక్ లను మంత్రి ప్రారంభించనున్నట్లు సర్పంచ్ వివరించారు. కావున నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అలాగే కూటమి నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## విస్తృతంగా పర్యటించిన మంత్రి



చిన్నమండెం, మార్చి 31 ప్రభాతవార్త :
చిన్నమండెం మండలం, సి.పొలిమేరపల్లెలో సోమవారం రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పలువురు అభిమానుల కోరిక మేరకు గ్రామంలో విస్తృతంగా పర్యటించి సి పొలిమేరపల్లెలో జరిగిన జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులకు పలువురు బాధితులు పలు సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ ఓపికగా విన్న మంత్రి అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలు పరిష్కరించడం జరిగింది. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సి. పొలిమేరపల్లె గ్రామానికి చేరుకోగానే ఆ గ్రామ ప్రజలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు

లక్కిరెడ్డిపల్లి : మార్చి 31 ప్రభాతవార్త



మండల పరిధిలోని కొనంపేట బి.ఎర్రగుడి గ్రామము నందు వెలిసిన శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చాలని అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. ఆదివారం మధ్యాహ్నం 2:00 గంటల నుంచి చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయం నుంచి ఊరేగింపుగా బిందు సేవకు బోరు దగ్గరికి వచ్చారు. కలశాలు ధరించిన భక్తులు ఆలయానికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఆదివారం రాత్రి 10:00 గంటలకు శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారు జ్యోతిని, కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ప్రథమ జ్యోతిని వెలిగించారు. రెండవ జ్యోతిని తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ, జాతీయ అధ్యక్షులు బండారు రఘురామయ్య వెలిగించారు. జోతులతో, నాద బృందాలు, అమ్మవారిని, భక్తిశ్రద్ధలతో తలపై ఉంచుకొని, అమ్మవారి భక్తి గీతాలు పాడుతూ, నృత్యాలు చేస్తూ, విశేషంగా అలంకరించింది. ఈ కార్యక్రమంలో శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ అధ్యక్షులు కొరకూటి నరసయ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గుద్దేటి రెడ్డెయ్య, ఆలయ కమిటీ సభ్యులు, భోజనపు వెంకటరమణ, భోజనపు లక్ష్మీనారాయణ, కొరకూటి గోవిందు, కొరకూటి వీర నరసింహులు, భోజనపు రామయ్య, దక్కఓబులేసు, చిన్న గాలి మోహన్, దండే శ్రీనివాసులు భోజనపు రామకృష్ణ, టేకూరి వెంకటసుబ్బయ్య తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ గౌరవాధ్యక్షులు సంగినాథం ఆంజనేయులు, రాయవరపు రామచంద్రయ్య, అధ్యక్షులు కళ్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శి పల్లా నరసింహారావు కోశాధికారి టేకూరి సుదర్శన్, గౌరవాధ్యక్షులు సుంకర రామచంద్రుడు. బి ఎర్రగుడి ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి జాతరలో పాల్గొన్న మంత్రి

రాయచోటి, మార్చి 31ప్రభాత వార్త
మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోమవారం రాయచోటి మండలం, గరుగుపల్లె అభయ ఆంజనేయస్వామి దేవస్థానం తిరుణాల సందర్భంగా మంత్రివర్యులు హాజరై అభయ ఆంజనేయస్వామి గుడిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గరుగుపల్లి ఆంజనేయస్వామి తిరుణాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలని మంత్రివర్యులు తిరుణాల కమిటీ సభ్యులకు సూచించారు.



## ఘనంగా చౌడేశ్వరీ దేవి జ్యోతి ఉత్సవాలు

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, కమిటీసభ్యులు

మదనపల్లె, మార్చి 31 ప్రభాతవార్త :
పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో వెలసియున్న శ్రీ చౌడేశ్వరీ దేవి ఆలయంలో జ్యోతి ఉత్సవం, అగ్నిప్రవేశం వైభవంగా జరిగాయి. పూజల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాలు పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. నీరుగట్టువారిపల్లె, కదిరిరోడ్డు, బైపాస్‌రోడ్డు, గొల్లపల్లె రోడ్డు ఉత్సవాల వల్ల రద్దీగా ఏర్పడ్డాయి. భక్తుల దైవదర్శనం నిమిత్తం ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. మహిళలు అమ్మవారికి దీలు బోణాలు సమర్పించారు. అమ్మవారిని అర్చకులు స్వామి ప్రత్యేక అలంకరణలో అలంకరించి భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. తొగటవీర క్షత్రియులు జ్యోతులను తయారుచేసి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేక వాహనంలో పురవీదుల్లో ఊరేగించారు. సోమవారం సాయంత్రం ఉట్ల తిరుణాల వైభవంగా జరిగింది. వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్, జనసేన రాయలసీమ కోకన్వీనర్ రాందాస్‌చౌదరి తన అనుచరులతో కలసి అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. ఆలయకమిటీ పురాణం చంద్రశేఖర్, బండి నాగరాజు, రత్నమయ్య, పవన్‌కుమార్, ఉప్పు రామచంద్ర, మోడెం వెంకటరమణ, ప్రభాకర్, లోకేష్, పురం రమణ, బండి మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రంజాన్ వేడుకలు


ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

తంబళ్లపల్లె మార్చి 31 ప్రభాతవార్త :
మండలంలో సోమవారం ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం పాత మసీదు నుండి మసీదు ఇమామ్ యూసుఫ్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు ఖురాన్ పటిస్తూ ఊరేగింపుగా క్రాస్ రోడ్ లోని ఈద్గా వద్దకు చేరుకొని ప్రార్థనలు నిర్వహించారు. అదేవిధంగా సిద్ధారెడ్డి గారి పల్లి లోని మసీదు నుండి ఇమామ్ బాబ్జాన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు ఈద్గా వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఇమామ్ ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ పవిత్రతను వివరిస్తూ ప్రతి ఒక్కరు తమ జీవితాల్లో ప్రేమ, శాంతి, దయ, సహనం, సమానత్వం, ఆనందం, ఆరోగ్యం, దానగుణం పెంపొందించుకోవాలని తద్వారా అష్టైశ్వర్యాలు లభిస్తాయని ప్రబోధించారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష చేపట్టిన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా మండలంలోని రేణుమాకులపల్లి, గోపి దిన్నె, కొట్టాల, కోసువారిపల్లి, కుక్క రాజు పల్లి, గంగిరెడ్డిపల్లి, ఎద్దుల వారి పల్లె లోని ముస్లిం సోదరులు వైభవంగా రంజాన్ నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో బాఫు సాహెబ్, డాక్టర్ మున్నా, జహంగీర్, జమాల్ బాషా, ముజీబ్, మహబూబ్ పీర్, పీర్ల మాబు, జిలాని భాష, మస్తాన్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు

## ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

నీటి సంరక్షణ పనులను పగడ్బందీగా చేపట్టాలి

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



సంబేపల్లి, మార్చి 31: ప్రభాతవార్త:
ప్రతి ఒక్కరు తమ ఇంటి ముందు తప్పకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకొని నీటి సంరక్షణా పనులు పగడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.సోమవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సంబేపల్లి మండలం, కొండావాండ్లపల్లెలో ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయన్నారు. వర్షం పడినప్పుడు వర్షపు నీరు వృధాగా పోకుండా ప్రతి నీటి బొట్టు భూములోకి ఇంకిపోయి భూగర్భ జలాలు పెరిగేందుకు తమ ఇంటి ముందు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు కొండా వాండ్లపల్లెలో 5, లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును మంత్రి ప్రారంభించారు. మంత్రివర్యులు కొండావాండ్లపల్లెకు చేరుకోగానే ఆ గ్రామ ప్రజలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మానవుడు సోదర భావంతో మెలగాలి

ప్రొద్దుటూరు, మార్చి 31, ప్రభాతవార్త :
అల్లాహ్ కృప సర్వమానవాళిపై వుండాలని ప్రొద్దుటూరు చీఫ్ ఖాజీ ఇనాయతుల్లా అన్నారు. సోమవారం ముస్లిం సోదరుల పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా స్థానిక కొర్రపాడు రోడ్డు, యర్రగుంట్ల రోడ్డు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈద్గాలలో ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోషం నిండిన వదనాలు, చిరునవ్వుల పలకరింపులు, మనసును ఉల్లాస పరిచే అత్తరు పరిమళాలు ముస్లిం సోదరుల మధ్య పండుగ వాతావరణాన్ని మరింత రెట్టింపు చేశాయి. ఆత్మీయతను పెంచే అలింగన దృశ్యాలు సోదర, స్నేహ భావానికి ప్రతీకలుగా దర్శనమిచ్చాయి. ఈ సందర్భంగా చీఫ్ ఖాజీ ఇనాయతుల్లా మాట్లాడుతూ సర్వమతాల సారం ఒక్కటేనని తెలిపారు. ప్రతి మానవుడు ఇతరుల పట్ల సోదర భావంతో మెలగాలని సూచించారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆరాధన ప్రార్థనలు మనుషుల్లో ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ ఉపవాసాలు, ఇఫ్తార్ల ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. అల్లా ఆజ్ఞ ప్రకారం ప్రతి ఒక్కరూ తన సంపాదనలో రెండున్నర శాతం జకాత్ రూపంలో పేదలకు ఖర్చు చేయడం ఈ రంజాన్ మాసంలో చేసే పవిత్ర పుణ్యకార్యం అన్నారు. అల్లా దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.



### కుమ్మరి తిప్ప పురాతన

## శివుని గుడి కోసం ప్రజలు ప్రయత్నం



మైదుకూరు, మార్చి 31, ప్రభాతవార్త:
మైదుకూరు మండలం తిప్పిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలోని కుమ్మరి తిప్ప నందు అతి పురాతన శివలింగానికి గుడి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడే శివాలయం నందు నూతన పంచాయతి నిధులు నుండి బోర్ మరియు కొత్త మోటార్ ను ఏర్పాటు చేసిన సర్పంచ్ బండి నాగేంద్ర, నీటి సమస్యను తీర్చడం జరిగింది. తిప్పిరెడ్డిపల్లి పంచాయతీ లోని కుమ్మరి తిప్ప నందు అతి పురాతన శివలింగం ఉంది తెలుగంగ కాలువ పనులు జరిగేటప్పుడు అక్కడ రూము ఏర్పాటు చేశారు. ఆ ప్రదేశంలో పంచాయతీ నిధులు నుండి నూతన బోర్ కొత్త మోటార్ ను వేయడం జరిగింది పురాతన దేవాలయ ఆధునికరణ చేయు సందర్భంగా నీటి వసతి కొరకు బోర్ వెయ్యడం జరిగింది నూతన బోర్ నుండి నీరు సమృద్ధిగా రావడంతో గ్రామ పంచాయతీ లోని ప్రజలు ఆదిరెడ్డి పల్లి గ్రామ ప్రజలు అందరు సంతోషం వ్యక్తం చేశారు. ఇందులో పార్టీలకు అతీతంగా అందరు పాల్గొని శివాలయ నిర్మాణం కొరకు అందరు పాటుపడాలని కోరారు. ఇక్కడ ఆలయం నిర్మాణం జరిగితే ఆధ్మాతికంగా ఆహ్లాదకర ప్రదేశంలో వనిపెంట ప్రాంత ప్రజలకు భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుంది.

## శివోహం అన్నప్రసాద సేవలో భాగస్వామ్యం ఆనందకరం


అన్నదానం నిర్వహిస్తున్న శివోహం కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 31, ప్రభాతవార్త:
శివోహం అన్నప్రసాద సేవా సంఘం వారి అన్నప్రసాద వితరణలో తాము భాగస్వామ్యం కావడం ఆనందకరమని రెడ్డి సేవా సంఘం, రెడ్ల కళ్యాణ మండపం కార్యవర్గ సభ్యులు తెలిపారు. సోమవారం స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ప్రతి సోమవారం నిర్వహించే అన్నప్రసాద సేవలో వారి సహకారంతో అన్నప్రసాద సేవ నిర్వహించారు. దాదాపు 600 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్యక్షులు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మురుకూటి సూర్య నారాయణ రెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, విజయకుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలు అందుకొన్న నాగార్పమ్మ

సుండుపల్లె, మార్చి 31, ప్రభాతవార్త:



మండల పరిధిలోని పెదినేనికాల్వ పంచాయతీ బండకాడ ఈడిగ పల్లెలో వెలిసి ఉన్న శ్రీ నాగారపమ్మ తల్లి ఆలయంలో పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించారు పలువురు బోనాలను సమర్పించారు అనంతరం అమ్మవారి ప్రతి ఆదివారం బేస్తవారం చిన్నపాటి తిరునాళ్ల లాగా భక్తులతో కిటికిట లాడుతుంది అమ్మవారి ఆశీస్సుల కోసం మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చుట్టు పక్కల మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందుతుంటారు.

## భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు



దువ్వూరు, మార్చి 31, ప్రభాతవార్త:
మండల పరిధిలోని ముస్లిం సోదరులు సోమవారం నాడు భక్తి శ్రద్ధలతో రంజాన్ పండుగను వైభవంగా నిర్వహించుకున్నారు. నెల రోజుల పాటు ఉపవాసాలు ఉండి సోమవారం ఈద్గా మైదానాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దువ్వూరు, చింతకుంట, ఎర్రబల్లి, కానగూడూరు, చల్లబసాయి పల్లె తదితర గ్రామాలలో ముస్లిం సోదరులు ఈద్గా మైదానాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత గురువులు రంజాన్ విశిష్టతను గురించి తెలియజేశారు. ముస్లిం సోదరులు ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## మామిడి చెట్లు, పైపులుకు నిప్పు..

సుడుపల్లి, మార్చి31, ప్రభాతవార్త:
మండల పరిధిలోని మాచి రెడ్డి గారి పల్లి గ్రామపంచాయతీ కటార ముదుకు సమీపంలోని అటవీ ప్రాంతం (లైను) లో గుర్తుతెలియని వ్యక్తులుఅడవికి నిప్పు పెట్టారని అది కాలుతు మిట్టబిడికి కి చెందిన మూడే లక్ష్మమ్మతో పాటు మరి కొంతమందికి చెందిన మామిడి చెట్లుకు ఆదివారం నిప్పు అంటుకుందని ఆ నిప్పు పెద్ద మంటగా మారి స్థానికంగా మామిడి చెట్లు నాటిన తోటలకు అంటుకున్నాయి.అంతే కాకుండా బోరు కు అమర్చిన కరెంటు వైర్లు, తోటకు వేసిన కంచె, తోటలో సాగునీటి కోసం వేసిన బోరు పైపులు, స్టాటరు అగ్గి కి దహనమైనట్లు స్థానిక రైతులు తెలిపారు. సుమారు 50 కి పైగా మామిడి చెట్లు దహనమైనట్లు తెలిపారు. మామిడి కాయలు కాసే సమయంలో చెట్లు కాలి పోవడం బాధాకరమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.అడవికి నిప్పు పెట్టడం వలన స్థానికంగా రైతులు నష్ట పోతున్నారని, మామిడి తోటల సమీపంలో మరియు వరీ వేరుశెనగ పంటల సమీపంలో నిప్పు పెట్టకుండా అటవీ సేక అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

